

# తృప్తి

**వి. రాజారామమోహనరావు**

మంచి ఆకలి మీదున్నప్పుడు కడుపు నిండా భోంచేస్తే తృప్తిగావుంటుంది... అలాగే రెండు మూడు రోజులు బాగా వొళ్ళలిసి నిద్రలేనప్పుడు కళ్ళనిండుగా నిద్రపోతే తృప్తిగా వుంటుంది .... ఏన్నోఏళ్ల నుంచీ చూడాలని తహతహ పడుతున్న మనుషులు కనపడి వాళ్ళలో కలిసి గడిపితే తృప్తిగా వుంటుంది .... ఇదంతా మానవసహజం. యిలాంటిదే మరో తృప్తి వుంది.

* * *

కేవలం సినిమా చూడాలన్న సరదాతోటే ఆ సినిమాకి రాలేదు సుందరం. సాయంత్రం ఆఫీసులో బైల్దేరేముందు పేపరు బాగా పరిశీలించి, ఏ హాల్లో ఏ సినిమా వుందో బాగా పరిశీలించి, ఆ సినిమా నిర్ణయించుకున్నాడు. అది అంత మంచిహాలు కాదు .... పైగా సిటీకి వో మూలగావున్న హాలు .... సినిమా బాగా పాతది. జానపదచిత్రం....అందులోనూ హిందీ సినిమా.

సుందరం అంచనా ప్రకారం హాలులో మొత్తం జనం వందమందికన్నా ఎక్కువ లేరు. తన అనుంగు చెలికత్తె వనజతో కలిసి మంచి వీలుగావున్న వో మూల సీటు చూసుకుని కూచున్నాడు సుందరం. వనజని తనకుడిచేతివేపు కూచోపెట్టుకునే విషయంలో ముందే జాగ్రత్త పడ్డాడు.

ఊళ్ళోని వో ప్రముఖమైన పారిశ్రామిక సంస్థలో ఆఫీసు సూపరింటెంట్ సుందరం. టెంపరరీ వుద్యోగాలు .... మెటీరియల్ పర్చేజ్‌వంటి కీలకమైన విషయాల్లో మంచిహోల్డ్‌వున్న వుద్యోగం. అదీకాక కంపెనీ జనరల్ మేనేజర్‌కి దూరపు బంధువు. అవకాశం, దానితోపాటు అధికారం .... మొత్తానికి పైలాపచ్చీసుగా వుంది సుందరం పని. యాభై ఏళ్ళ వయసు దగ్గరపడుతున్నా, పైసంపాదనా, సౌఖ్యాలు, కోరికలు సుందరానికి ముప్పై ఏళ్ళ యువకుడి జీవితాన్నే అందిస్తున్నాయి. వనజని టెంపరరీ వేకెన్సీలో ఎప్పాయింట్ చేసుకుని ఆరునెలలైంది. మొదటిసారి చూసినప్పుడే నచ్చింది వనజ సుందరానికి. తనదగ్గర అసిస్టెంట్‌గా వేసుకుని, పర్మినెంట్ చేయించేస్తానని ప్రామిస్‌చేసి .... యింకా వనజ చిన్న చిన్న సరదాలు తన పైసంపాదనలోంచి తీర్చేసి మొత్తానికి తనదారికి తెచ్చేసుకున్నాడు.

అత్యున్నత స్థానానికి వెళ్లాలంటే అత్యల్పస్థానాన్నుంచి ప్రారంభించాలి. (సైరన్)




సుందరం తనకి వలేస్తున్నాడని వనజకి తెలుసు. అప్పటికే జీవితంలో వందా, నూటయాభై రూపాయల చిన్న చిన్న వుద్యోగాలు చేసి చేసి విసిగి పోయింది. అలసటతో ప్రాణం పోతుందేమో అనిపించే ఆ వుద్యోగాలు చేసి చేసి చాలాఏళ్ళు మడికట్టుకువి, అన్నిరకాల అవమానాలు, యిబ్బందులు తట్టుకుంటూ గడిపింది.

ముప్పైఏళ్ళ పైబడ్డ వయసు. అంత వరకూ స్థిరపడని జీవితం. వెనక ఆదుకునే అండలేని బతుకు. అన్నిరకాలుగా నిరుత్సాహపడి, విసిగిపోయిన సమయంలో సుందరం తారసపడ్డాడు వనజకి. ఇంక వోపికలేక రాజీపడిపోయి తెలిసి తెలిసే సుందరం అందించిన ఎర మింగింది.

సినిమాకి వచ్చేముందు కొన్న పాప్ కారన్, సమోసాలు, కేక్‌లు తింటూ కుడి పక్కనేవున్న వనజతో సరసాలాడుతూ సినిమా చూస్తున్నారు సుందరం, వనజ. వనజశరీరం తెలియందేంకాదు. అయినా అలా సినిమా చూస్తూ, ఏదోఒకటి నవ్వుల్తూ, ఆ మసకచీకటిలో అదోరకం సరదా సుందరానికి.

సుందరానికున్నంత సరదాగాలేదు వనజకి. ఆ సమయంలో అతనితో కలిసి అలా సినిమా చూట్టమేకాదు, మొత్తం ఎఫైర్‌లోనే సరదాలేదు వనజకి.... కేవలం ఉద్యోగం పెర్మనెంట్ అవుతుందని ఆశ....! అప్పుడప్పుడు ఏదో ముష్టిలా పదిపదిహేనూ యిచ్చేసుందరం ఔదార్యం అవసరంతప్ప, యిష్టం లేని తతంగం తనకిది. అదీకాక వనజ అనుమానం వనజకుంది.... 'అసలే గుంటనక్కలాంటి మనిషి.... నిజంగా వుద్యోగం పెర్మినెంట్ చేయిస్తాడా.... మోజు తీరాక పొమ్మంటాడా....' అని. అయినా చేసేదేం లేక అయిష్టమైన ఆ బంధిఖానానీ, సుందరం అధికారాన్నీ భరిస్తోంది.

సుందరానికి సినిమాలో పాటలూ, డేన్సులూ బాగానే వున్నాయనిపించాయి. పాతసినిమా అయినా యాక్షన్ అన్నీ బాగానేవున్నాయి అనుకున్నాడు. అన్నింటికన్నా ఆ సినిమాలో ఓ సీన్ సుందరానికి గొప్ప హుషారిచ్చింది.

సినిమాలో దుష్టుడైన రాజుగారికోసం వో వినోదం ఏర్పాటుచేశారు. పారిపోటానికి వీలులేని ఏర్పాటుచేసి వోపాముకి, ముంగిసకిమధ్య పోరాటం....తప్పనిసరై అసహాయంగా అవి దెబ్బలాడుకుంటుంటే రాజుగారికి వినోదం. ఆయన వుత్సాహపడిపోతూ, వుద్రేకపడిపోతూ చూస్తున్నాడు ఆ వినోదాన్ని. అవి అలా దెబ్బలాడించి వినోదం చూడగల అధికారం తనకి వుండటం తాలూకు ఆనందం ఆ రాజుగారి ప్రతిచూపులోనూ కనిపించింది సుందరానికి.

ఆ రాజుగారితో పాటు ఆయన ఫేస్టకి సుందరం వుత్సాహపడ్డాడు. సరదా పడ్డాడు.... "భలే.... భలే...." అని ఆనందపడి వొకటి రెండుసార్లు వనజని మోచేత్తో పొడిచాడుకూడా....

అన్నింటిలాగే సినిమా అయ్యేవరకు సుందరం ఆ ఆనందాన్నీ కిక్కురుమనకుండా భరించింది వనజ.

సినిమాఅయి బైటికివస్తుంటే, ఆ రోజు తాలూకు నోటికిసరిపడా తనమనసు చచ్చిపోయినట్టు, రోజూలాగే ఆ రోజూ అనిపించింది వనజకి.

* * *

కావల్సిన కలపతోపాటు ప్రవాహంలో అఖ్ఖర్లేని చెత్తకూడా కొట్టుకొచ్చినట్టు, వనజతోపాటు అదేసమయంలో యింకో టెంపరరీ వేకన్సీలో రవినికూడా సుందరమే ఎప్పాయింట్ చేశాడు.

మొదటినెల రవిని అంతగా పట్టించుకోలేదు సుందరం. కానీ ఆ తర్వాత సుందరం దృష్టిలో పడ్డాడు రవి. ఇరవై మూడేళ్ళ వయసుకి మించి బలంగా, యవ్వనంగా కనపడ్డ రవిని, రవి ఫ్రెష్‌నెస్‌ని చూస్తే కొంచం యిబ్బంది, అసహనం కలిగాయి సుందరానికి.

తనస్థాయికన్న కిందవాళ్ళు ఆఫీసులో తన అధికారానికి లోబడే వున్నారని సుందరానికి తెలుసు. అయినా అస్తమానం వాళ్ళకి ఆ విషయం గుర్తుచేస్తున్నట్టు ప్రవర్తించటం సుందరానికి సరదా. గుర్తింపుకొచ్చాక రవినికూడా పాతవాళ్ళతో జేర్చేడు సుందరం.

అస్తమానం చేసినపనిలో ఏవో తప్పులు చూపించి సుందరం కేకలేస్తున్నా వోపిగ్గా భరిస్తున్నాడు రవి.




ఎప్పుడూ ఎదురుచెప్పక రోజులు గడుపుతున్నాడు. ఉద్యోగాలు దొరకనిబాధ, మంచి అవకాశంకోసం ఆరాటం ఇవన్నీ రవి అనుభవంతో వున్నాయి. సుందరం ప్రవర్తన బాధిస్తున్నా, వోపిగ్గా తట్టుకుంటున్నాడు.

రవి మౌనం, అతని యవ్వనం,బలం తనఅధికారం ముందు చేతులు కట్టుకు నిలబట్టం, సుందరానికి గొప్ప సరదాగా వుంది.

అలవాటుగా వోపని చెయ్యటంవేరు. అతనిలో సరదాని గుర్తించాక చెయ్యటం వేరు. యీ మధ్య సుందరానికి ఆఫీసు అధికారం మరింత సరదాగా వుంటోంది, ఎవర్నైనా చివాట్లుపెట్టినప్పుడు చిన్నబుచ్చినప్పుడూ.... అతనికి సినిమాలో పామూ, ముంగిసా దృశ్యం, రాజుగారి అధికారతృప్తి ఆలోచనలో, అనుభవంలో తెలియకుండా దుల్తూ తన గొప్పతనం మరింత సంతోషంగా వుంటోంది.

సుందరంపక్కనే వనజసీటు. వీళ్ళిద్దర్నీ మిగిలిన హాలులోవాళ్ళతో వేరుచేస్తూ వుడెన్‌పార్టిషన్ వుంది. సరిగ్గా ఆ పార్టిషన్ దగ్గరే రవిసీటు. సుందరానికి రవి పూర్తిగా కనిపిస్తాడు, కానీ రవికి సుందరం సగమే కనిపిస్తాడు. వనజసీటు అసలు కనిపించదు. సుందరం వనజవేపు వొంగినా, చేతులు కదిపినా రవికి కనిపిస్తుంది. కానీ సుందరం ఏంచేస్తున్నదీ కనిపించదు. తన గొప్పతనం తెలుస్తూ, తన ఏకాంతానికి అడ్డులేని ఆ సీట్లు ఏర్పాటు అలా వుండటం సుందరానికి ఎంతో బావుంది.

రవి చూస్తుండగానే వనజతో ఏదో చిలిపిమాట అంటం, చిలిపిపనిచేసి నవ్వటం .... అది రవి చూస్తుంటే .... చూసి తలవంచుకుంటుంటే మంచి థ్రిల్లింగా వుంది సుందరానికి "ఆఖరికి తనముందు మంచి పడుచువయసు తలొంచుకుంటోంది....యింకేం కావాలి...." అన్నట్టు ప్రవరిస్తున్నాడు సుందరం.

రవికి యీ పర్థితి మరీ యిబ్బందిగా వుంది. సుందరంవేపు ఎంత చూడకూడదనుకుంటున్నా, అప్పుడప్పుడేనా చూపు అటు వేపు పోకుండా ఆపుకోలేకపోతున్నాడు. బలవంతంగా తలవంచుకు కూచుంటే ఏదో పనివంకన సుందరం పిలుస్తున్నాడు. రవికి తన పరిస్థితి ఎంత బాధగావుందో ....వనజ పరిస్థితి తలుచుకుంటే అంతకన్నా బాధగా వుంది.... స్థిరమైన వుద్యోగం ఆ విషయంలో తమిద్దరికే బలహీనత వుందని రవికి తెలుసు....

సుందరానికి వీలుగా, రవికి వనజకి యిబ్బందిగా, ఆఫిసులో యింకా చాలా మందికి అసౌకర్యంగా రోజులు గడు

స్తూనేవున్నాయి.... రోజులు అలాగడుస్తున్నప్పుడే ఆ రోజు వచ్చింది....

రవిరాసిన డ్రాఫ్ట్ పెద్దదిగా వుందని తనసీటు దగ్గరకు పిలిచి అనేక రకాల చివాట్లు పెట్టాడు సుందరం. అజాగ్రత్తన్నాడు.... వొళ్ళుబద్ధకం అన్నాడు.... మామూలుగానే రవి చేతులుకట్టుకు నిలబడ్డంతప్ప ఏం మాట్లాడలేదు. వనజ కూడా తలవంచుకూర్చుంది. సుందరం మాటలన్నీ వింటూ మధ్యమధ్యలో ఒకటి రెండుసార్లు కొద్దిగా తలెత్తిచూశాడు రవి.

రవి అలాచూట్టం సుందరాన్ని మరింత టెంప్ట్‌చేసింది. వాగుడుస్థాయి మరింత పెంచాడు. పెంచిఅన్ని మాటల్తో పాటే ఆ నాలుగుమాటలూ అన్నాడు."ఏం కుర్రోళ్ళయ్యా మీరు.... ఏంఅన్నా సిగ్గులేదు .... చీమూ నెత్తురూ వున్నవాళ్ళకి యిన్నిమాటలు అక్కర్లేదు .... వోపికలేని గట్టికుక్కైనా నయం....గట్టిగా ఛీఅంటే మొరగనన్నా మొరుగుతుంది.

అసలు ఏమాత్రం మగతనంలేని బతుకు.... కొజ్జాబతుకు.... యిదీ వోబతుకే...." అన్నాడు. ఆ మాటలకు వనజా తలెత్తింది. రవీ తలఎత్తాడు. ఆ తలెత్తటమే కాదు.... బద్ధలయ్యాడు. అంతా వనజ చూస్తుండగానే మెరుపులా జరిగింది.

రవి ముందుకివంగి, సుందరం చొక్కా పుచ్చుకుని లేవదీయటం, దవడ అదిరేలా ఆ చెంపా, యీ చెంపా వాయించటం.... సుందరానికి నోటమాట రాలేదు.... వొళ్ళంతా వొణుకు.... ఆ సమయంలో రవికి ఎదురునిలచే బలము కాదు ధైర్యంకూడా లేకుండాపోయింది సుందరానికి.... అంతకీ అహంకారం, అధికారం చావక.... "నన్నే కొడతావా.. నీకెంత ధైర్యం.... తెల్లారేటప్పటికి నిన్ను, నీ వుద్యోగాన్ని ఏం చేస్తానో చూడు"అన్నాడు.

"ఏం చేస్తారు....ఉద్యోగం తీసేస్తారా.... తీసెయ్యి అదీ చూస్తాను.... కొత్తఉద్యోగం, ఎందుకు గొడవపడటం అని అవసరంకోసం వూరుకుంటే నీ యిష్టం వొచ్చినట్టు చేసావు.... మాకు మనసు....వోపికకి వో లిమిటూ వున్నాయి. ఏదో చేద్దాం అనుకుంటున్నావేమో.. ఏదేనా పిచ్చిపనిచేసావా.... నీ వొంట్లో ఎముకమిగల్నివ్వను....గుర్తుంచుకో.." అని వెళ్ళిపోయాడు.

భయంతో కుర్చీలో ముడుచుకున్నట్టు కూచున్నసుందరాన్ని చూస్తేనవ్వొచ్చింది వనజకి. జరిగిందంతా కళ్ళముందు కదులుతున్నట్టేవుంది. రవి వొంగి సుందరం చొక్కా పుచ్చుకుని లేవదీయటం క్షణం ఆలస్యంలేకుండా లెంపలు పగల కొట్టటం....

'భలే.... భలేకొట్టాడు.... నా పేరు చెప్పి మరో రెండు తగలనివ్వాల్సింది.." అనుకుంది సుందరంవేపు చూస్తూ.... అనవసరానికే తనులొంగింది....అవసరానికే అతనితో కలిసి గడుపుతోంది. అంతే కాని సుందరం వికృతచేష్టలకి యిష్టపడి.... అతని హింసాప్రవృత్తికి మోజుపడికాదు.... 'వెధవకి, దరిద్రపు వెధవకి భలే జరిగింది....' అనుకుంది.

తను కొట్టకపోయినా సుందరాన్ని రవికొట్టిన దెబ్బలు తను కొట్టినట్టే అనిపించాయి వనజకి.... తను ఆ పనిచెయ్యలేకపోయినా.... చేసినతృప్తి.... ఎంతో తృప్తి.... మనుష్య సహజమైనహాయి... తన ఆడమనసు అవసరం తీరినంత తృప్తిగా వుంది. వనజకి, కుర్చీలో కూరుకుపోయిన సుందరాన్ని చూస్తుంటే....

